క్లుప్తంగా

శ్మశానం ఆక్రమణపై ఆర్డీవోకు ఫిర్యాదు


ఆర్డీవోకు ఫిర్యాదు చేస్తున్న పెద్ద చల్లారిగుంట గ్రామస్తులు

పలమనేరు: శ్మశానాన్ని కొందరు ఆక్రమించుకున్నారని బైరెడ్డిపల్లి మండలం పెద్ద చల్లారిగుంటకు చెందిన దళితులు ఆరోపించారు. వారు బుధవారం ఆర్డీవో భవానికి ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ గతంలో తమకు శ్మశానం కోసం గ్రామంలో 1.25 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పక్క గ్రామానికి చెందిన కొందరు ఆ భూమిని ఆక్రమించుకుని తమ పొలాల్లో కలిపేసుకున్నారని వాపోయారు. గ్రామస్తులు సోము, సరస్వతి, వాణి, శివ, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పిల్లలకు దస్తుల పంపిణీ



పలమనేరు: పట్టణ సమీపంలోని రిమ్మర్స్ బుద్ధిమాంద్యం పాఠశాలలోని పిల్లలకు బుధవారం బీజేపీ నాయకులు దుస్తులను పంపిణీ చేశారు. ఆ పార్టీ జిల్లా నాయకుడు ప్రభాకర్ మాట్లాడుతూ బీజేపీ సేవా ఉత్సవాల సందర్భంగా పిల్లలకు దుస్తులు పంపిణీ చేసినట్టు తెలిపారు. నాయకులు రామన్న, ప్రసాద్, గుప్తా, వెంకటాద్రి పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వే పరిశీలన


స్వామిత్వ స్పెషల్ డ్రైవ్‌ను పరిశీలిస్తున్న డీపీవో సుధాకర్ రావు

పెద్దపంజాణి: మండలంలో జరుగుతున్న స్వామిత్వ కార్యక్రమాన్ని బుధవారం డీపీవో సుధాకర్‌రావు పరిశీలించారు. సర్వేను సకాలంలో పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులు, సర్వేయర్లను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రత్యేకంగా స్వామిత్వ కార్యక్రమం కోసం 15 మంది సర్వేయర్లను నియమించినట్టు తెలిపారు. అనంతరం ఆయన ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సర్వేయర్లతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల ఆస్తులకు డ్రోన్ సర్వేతో కచ్చితమైన హద్దులు గుర్తించడంతోపాటు చట్టబద్ధమైన హక్కులు కల్పించడమే స్వామిత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రతి రోజూ వీధులను, మురుగు కాలువలను శుభ్రం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలాజీ, డిప్యూటీ ఎంపీడీవో శారదా దేవి పాల్గొన్నారు.

యూరియా ఇవ్వకపోవడంపై రైతుల ఆగ్రహం


ఎరువుల దుకాణం సిబ్బందితో వాదనకు దిగిన రైతులు

శాంతిపురం: రెండు రోజులుగా తిరుగుతున్నా యూరియా ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు బుధవారం శాంతిపురంలోని ఒక ప్రైవేటు ఎరువుల దుకాణం నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. వారు మాట్లాడుతూ యూరియా కోసం మంగళవారం వస్తే సచివాలయంలో రాయించుకు రావాలని చెప్పారని తెలిపారు. ఇప్పుడు యూరియా లేదని చెప్పడం ఏమిటని మండిపడ్డారు. స్టాకు లేనప్పుడు లెటర్లు తీసుకురావాలని ఎందుకు చెప్పారని నిలదీశారు. స్టాకు వచ్చాక ఇస్తామని షాపు నిర్వాహకులు సర్ది చెప్పడంతో రైతులు వెనుదిరిగారు.

సచివాలయ వ్యవస్థ నిర్వీర్యం!

- సచివాలయాలపై కత్తికట్టిన కూటమి సర్కార్
- సిబ్బందికి సర్వే పనుల అప్పగింత
- ఆగిన పౌరసేవలు
- మీసేవా కేంద్రాలను ఆశ్రయిస్తున్న జనం

పలమనేరు నియోజకవర్గంలో సచివాలయాలు	- 108
ఒక్కో సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బంది	- 10 మంది
- మొత్తం సిబ్బంది	- 1100 మంది

ప్రజలకు స్థానికంగానే అన్ని ప్రభుత్వ సేవలు అందించేలా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చింది. తద్వారా ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లే అవకాశం లేకుండా సత్వరం సేవలు అందించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి కంకణం కట్టుకుంది. సిబ్బందికి పలు సర్వే పనులు అప్పగించింది. దీంతో కార్యాలయాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. పలు పనుల కోసం వచ్చే ప్రజలు మళ్లీ మండల కేంద్రంలోని కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. సర్టిఫికెట్ల కోసం మీసేవా కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు.

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలో మొత్తం 108 సచివాయలాలు వున్నాయి. 1100 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. వారిలో గ్రేడ్ - 5 పంచాయతీ కార్యదర్శి సాధారణ పరిపాలనతోపాటు ,గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ తదితర పనులు చూసేవారు. డిజిటల్ అసిస్టెంట్ 540 రకాల సేవలకు సంబంధించి కంప్యూటర్‌లో నిక్షిప్తం చేయడంతోపాటు డాక్యుమెంటేషన్, అవసరమైన సర్టిఫికెట్ల జారీ పనులు చేసేవారు. వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రభుత్వ పథకాల అమలు, బడుల్లో మధ్యాహ్న భోజనం పర్యవేక్షణ, గ్రామంలో శానిటేషన్ పనులు చేసేవారు. సెరికల్చర్, అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లు ఆయా శాఖల అధికారులకు సహాయకులుగా ఉంటూ రైతు సేవా కేంద్రాల్లో రైతులకు సేవలు అందించేవారు. ఏఎన్ఎంలు ఆశాకార్యకర్తల సాయంతో ప్రజలకు వైద్య సేవలు అందించేవారు. విలేజి సర్వేయర్ మండల సర్వేయర్‌కు సహాయకులుగా వుండేవారు. అనిమల్ హెస్బెండరీ అసిస్టెంట్ పాడి రైతులకు సేవలు అందించేవారు.


సిబ్బందిలేక ఖాళీగా వున్న పెద్దపంజాణి మండలంలోని ఒక సచివాలయం (ఫైల్ ఫొటో)


గ్రామాల్లో సర్వే చేస్తున్న సచివాలయ ఉద్యోగి

సిబ్బందికి సర్వేల పనులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయాల్లో 540 సేవలు ఆపేశారు. ప్రస్తుతం పింఛన్ల పంపిణీ, మంచి ప్రభుత్వం కరపత్రాల పంపిణీ, పీ-4 సర్వే, వర్క్ ఫ్రం హోమ్, మనమిత్రపై అవగాహన, ఈకేవైసీ అప్‌డేట్, కౌశలం, హౌస్ హోల్డ్ జియోటాగింగ్, ఎన్‌పీసీఐ లింకేజీ, ఆధార్‌తో బ్యాంకు ఖాతాలు లింక్, ఇంటింటా ఆరోగ్య సర్వే, స్వర్ణ పంచాయతీ డేటా ఎంట్రీ, ఆర్‌టీఎఫ్, ఎంటీఎఫ్, పాఠశాలల విజిట్, టాయ్‌లెట్ల ఫొటోల అప్‌లోడింగ్ తదితర విధులను అప్పగించారు.

జాబ్‌చార్ట్ లేదు

సచివాలయ ఉద్యోగులకు జాబ్ చార్ట్ కేటాయించలేదు. వారిపై ఎవరి పర్యవేక్షణ ఉంటుందనే విషయాన్ని స్పష్టం చేయలేదు. దీంతో అన్ని శాఖల అధికారుల అజమాయిషీ కొనసాగుతోంది. సర్వేలపై సర్వే పనులు అప్పగిస్తున్నారు. వారు కాదని మొండికేస్తే వెంటనే షోకాజ్ నోటీసులు ఇస్తున్నారు.

నిర్దిష్టమైన జాబ్‌చార్ట్‌ను అమలు చేయాలి...



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాకు రకరకాల సర్వేల పేరిట ఒత్తిళ్లకు గురిచేస్తున్నారు. సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ మాత్రమే ఉంటారు. గతంలో అందిస్తున్న సేవలు ఇప్పుడు లేవు. దీనిపై ప్రభుత్వం ఆలోచించి తగు నిర్ణయం తీసుకోవాలి. మాకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు అందేలా చూడాలి. -మురళీనాథ్, సచివాలయాల సంక్షేమ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

సచివాలయాలయ వ్యవస్థ నాశనమైంది



గత ప్రభుత్వంలో జనానికి ఏ పని అయినా సచివాలయంలో ఉచితంగా గంటలో జరిగేది. కూటమి పాలనలో సచివాలయ వ్యవస్థ నాశనమైంది. సేవలు లేవు. సీఎస్‌సీ, మీసేవా సెంటర్లకు వెళ్లి సేవలను డబ్బులు కట్టి చేయించుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వాలు ప్రజలకు మేలు చేయాలి గాని ఇలా ఇబ్బందులు పెట్టడం కరెక్ట్‌కాదు. -వెంకటేగౌడ, మాజీ ఎమ్మెల్యే, పలమనేరు

ఆక్రమణల తొలగింపులో వివక్ష వద్దు


తహసీల్దార్ శివయ్యకు వినతి పత్రం ఇస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

శాంతిపురం: ఆక్రమణల తొలగింపులో వివక్ష చూపకుండా అన్నింటినీ తొలగించాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, జిల్లా ఉపాధ్యక్షుడు కె.కోదండరెడ్డి కోరారు. వారు బుధవారం తహసీల్దారు శివయ్య, ఎంపీడీవో ఏపీఆర్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ డొంకుమానిపల్లి రెవెన్యూలోని 2.08 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జాకు గురైందన్నారు. దాన్ని స్వాధీనం చేసుకుని ప్రజా అవసరాలకు వినియోగించాలని కోరారు. కెనమాకులపల్లి రెవెన్యూలోని సర్వే నంబర్ 124లో ఉన్న 7.24 ఎకరాల ప్రభుత్వ భూమిని సర్వే చేసి పూర్తి స్థాయిలో ఆక్రమణలు గుర్తించాలని డిమాండు చేశారు. శాంతిపురంలోని కేజీఎఫ్ రోడ్డు కూడలిలో రోడ్డును ఆక్రమించి నిర్మిస్తున్న భారీ షాపింగ్ కాంప్లెక్స్‌పై చర్యలు తీసుకోవాలని, అసైన్డ్ భూములు చేతులు మారకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్థిక సంఘం నిధులపై కత్ర పెత్తనం వద్దు

పంచాయతీలకు వచ్చిన ఆర్థిక సంఘం నిధులను సర్పంచులు వినియోగించుకోకుండా చేయవద్దని వైఎస్సార్ సీపీ నాయకులు ఎంపీడీవో ఏపీఆర్ కుమార్‌ను కోరారు. ఇతర మండలాల్లో టైయిడ్, అన్ టైయిడ్ పేరుతో లేని నిబంధనను అమలు చేస్తున్నారని, దీంతో అప్పులు చేసి పనులు చేసిన సర్పంచులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాలతో నిబంధనలు విధించామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచులు పూలకుంట భాస్కర్, రాధా కృష్ణ, ఎంపీటీసీలు ఆర్ముగం, చలం, రమేష్, నాయకులు చలపతి, సైపుల్లా, ప్రభాకర్‌రెడ్డి, గజ్జల రమేష్, మురళీమోహన్‌రెడ్డి, అంచనాయన కుప్పం కృష్ణమూర్తి, ధనుంజయ, మణి, గణేష్, మురుగేష్ పాల్గొన్నారు.

మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో వాణిశ్రీదేవి, మందులు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి మురళి

పులిచెర్ల(కల్లూరు): ఆరోగ్యమే మహాభాగ్యమని ఐసీడీఎస్ సీడీపీవో వాణిశ్రీదేవి తెలిపారు. పులిచెర్ల పీహెచ్‌సీలో బుధవారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు గుడ్లు, పాలు, ఆకు కూరలు, చిరుధాన్యాలు తినాలన్నారు. అనంతరం వైద్య శిబిరం నిర్వహించి బాలింతలు, మహిళలకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, మండల కన్వీనర్ నాదమునిరెడ్డి, సూపర్‌వైజరు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

పెద్దపంజాణి: మహిళలు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని పెద్దపంజాణి, రాయలపేట పీహెచ్‌సీల వైద్యాధికారులు మురళి, మాధవి తెలిపారు. వారు బుధవారం పెద్దపంజాణి, వీరప్పల్లి గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. గైనికాలజిస్టు మీనాక్షి, డెంటల్ స్పెషలిస్టు దేవరాజ్, ఈఎన్‌టీ స్పెషలిస్టు యుగంధర్, చిన్నపిల్లల వైద్యులు ప్రవీణ్ పాల్గొన్నారు.

మహిళల్లో రక్తహీనతను నివారించాలి

రొంపిచెర్ల: మహిళలు రక్త హీనతకు గురికాకుండా చూడాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష తెలిపారు. గానుగచింత అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని పిల్లలు, బాలింతలు, గర్భిణులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జయమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పీ-4పై సచివాలయ సిబ్బందికి శిక్షణ

పులిచెర్ల(కల్లూరు): మండల కేంద్రమైన పులిచెర్లలో బుధవారం పీ-4 కార్యక్రమంలో బంగారు కుటుంబాల ఎంపికపై సచివాలయ సిబ్బందికి ఒకరోజు శిక్షణ ఇచ్చినట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో మునిరాజ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ బంగారు కుటుంబాల ఎంపిక, మార్గదర్శకులు చేయాల్సిన పనులు, పేదరికం నిర్మూలన కోసం తీసుకోవాల్సిన చర్యలపై విధి విధానాలపై సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించినట్టు తెలిపారు.

వివరాలను పకడ్బందీగా సేకరించాలి

సదుం: పీ-4 సర్వేలో లబ్ధిదారుల వివరాలను పకడ్బందీగా సేకరించాలని ఎంపీడీవో రాధారాణి ఆదేశించారు. ఆమె బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పీ-4 సర్వేలో లబ్ధిదారుల వివరాల సేకరణపై శిక్షణ ఇచ్చారు. మండలంలో 1,009 మంది పీ-4 లబ్ధిదారులను గుర్తించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో దామోదర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బలిజల్లో దొమ్మరి కులాన్ని చేరిస్తే ఉద్యమాలు


తహసీల్దార్ రాముకు వినతి పత్రం ఇస్తున్న బలిజ సంఘం నేతలు

పుంగనూరు: బలిజల్లో దొమ్మరి కులస్తులను చేర్చి గిరిబలిజగా గుర్తిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబరు 5ను తక్షణమే ఉపసంహరించుకోవాలని బలిజ కులస్తులు మండిపడ్డారు. నియోజకవర్గ కాపునాడు అధ్యక్షుడు నానబాలమణి, బలిజ సంఘం అధ్యక్షుడు నానబాలగణేష్, ప్రధాన కార్యదర్శి పూలత్యాగరాజు, పీపుల్స్‌ఫ్రంట్ అధ్యక్షుడు మధురాయల్, లీగల్ అడ్వైజర్ మనోహర్, సెక్రటరీ హేమంత్‌కుమార్ బుధవారం బలిజ కులస్తులతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం దొమ్మరి కులస్తులను అన్నివిధాలా ఆదుకోవడంలో అభ్యంతరం లేదన్నారు. వారిని గిరిబలిజగా తమ కులంలోకి చేర్చడం సహేతుకం కాదన్నారు. దీంతో బలిజల మనోభావాలు దెబ్బతింటున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే ఉపసంహరణ చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ రాముకు వినతి పత్రం అందజేశారు. సమావేశంలో బలిజ సంఘ నాయకులు బండిబాలు, అమరనాథ్, చిన్న, కుమార్, పూలభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం

పుంగనూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్టు తహసీల్దార్ రాము తెలిపారు. అన్ని శాఖల అధికారులు తప్పక హాజరై ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

27న ఉచిత కంటి వైద్యశిబిరం

పుంగనూరు: పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనలో ఈ నెల 27న ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు సంఘం అధ్యక్షుడు చెంగారెడ్డి తెలిపారు. చెన్నైకి చెందిన శంకర్ నేత్రాలయ వైద్యులు కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి చెన్నైలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని వెల్లడించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

27న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పుంగనూరు: ఈ నెల 27న మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్టు చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. ఇందులో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించనున్నట్టు తెలిపారు. సభ్యులు, అన్నిశాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

లోక్ కల్యాణ్ మేళాతో వ్యాపారులకు సహాయం

కుప్పం: మున్సిపాలిటీలోని వీధి వ్యాపారులకు లోక్ కల్యాణ్ మేళా కార్యక్రమం ద్వారా సహాయ సహకారాలు అందించనున్నట్టు కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం కుప్పం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. వ్యాపారులకు ఐడీ కార్డుల పంపిణీ, బ్యాంకుల ద్వారా రుణ సాయం కోసం చర్చ, డిజిటల్ ఆన్ బోర్డింగ్‌పై అవగాహన తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

దసరా ఉత్సవాలకు ఆహ్వానం


జిల్లా కలెక్టర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఆలయ కమిటీ సభ్యులు


ఎస్పీకి ఆహ్వానం..

వి.కోట: పట్టణంలో వున్న దుర్గామాత ఆలయంలో ఈ నెల 30న నిర్వహిస్తున్న దసరా మహోత్సవాల్లో పాల్గొనాలని జిల్లా అధికారులను ఆలయ కమిటీ సభ్యులు కోరారు. వారు బుధవారం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుతో కలిసి కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, ఎస్పీ తుషార్ డూడి, జాయింట్ కలెక్టర్ విద్యాధరికి ఆహ్వాన పత్రికలు అందజేశారు. వారు మాట్లాడుతూ ఈ నెల 30న వి.కోట పట్టణంలో మహిళలు 3,500 పాల కలశాలు తీసుకుని ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి వెళతామని తెలిపారు. అక్కడ అమ్మవారికి అభిషేకం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దామోదరం రెడ్డి, రఘుపతి, జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీతపై ఇంటింటా ప్రచారం

పెద్దపంజాణి: త్రైత సిద్ధాంత భగవద్గీతను ప్రతి ఒక్కరూ పఠనం చేయాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞానవేదిక వి.కోట కమిటీ అధ్యక్షుడు అశోక్ బాబు తెలిపారు. ఆయన బుధవారం సమితి సభ్యులతో కలిసి నాగిరెడ్డిపల్లి, చల్లావారిపల్లి, గొదమాకులపల్లి, వడ్డిపల్లి, గొనివారిపల్లి, కమ్మపాళ్యం, గౌరీనగర్ గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలను గ్రామస్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఝాన్సీ, గౌతమ్‌కృష్ణ, ఈశ్వర్, కుమారి, మీనాక్షి, ఆనంద్ పాల్గొన్నారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: త్రైత సిద్ధాంత భగవద్గీతను ప్రతి ఒక్కరూ చదవాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు పెంచల నరసయ్య కోరారు. ఆయన బుధవారం సేవా సమితి సభ్యులతో కలిసి పుంగనూరు, చౌడేపల్లె మండలాల్లో భగవద్గీతపై ప్రచారం చేశారు. కార్యక్రమంలో కిరణ్, మధు, గాయత్రి, నర్సారెడ్డి, భాగ్యమ్మ, కల్పన తదితరులు పాల్గొన్నారు.

చిన్నతనం నుంచే సేవాభావం కలిగి ఉండాలి


సదుం: ర్యాలీ చేస్తున్న కళాశాల విద్యార్థులు


చౌడేపల్లె ఆస్పత్రిలో ఎన్ఎస్ఎస్ క్యాంపు

సదుం: విద్యార్థి దశ నుంచే సేవా భావం అలవర్చుకోవాలని, ఇందుకు ఎన్ఎస్ఎస్ ఉపయోగపడుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటనాథ రెడ్డి తెలిపారు. కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థుల్లో సేవా భావం పెంపొందించడం, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలను మెరుగుపరుస్తున్నట్టు తెలిపారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసరు బాలాస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

గుడుపల్లె: విద్యతోనే ఉన్నత శిఖరాలు సాధ్యమని, విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామక్రిష్ణమనాయుడు తెలిపారు. కళాశాలలో ఆవరణలో బుధవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు సమాజ సేవ చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతను కలిగి వుండాలని సూచించారు. చెడు వ్యసనాల జోలికి వెళ్లకుండా బాగా చదువుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రమేష్ పాల్గొన్నారు.


ప్రభుత్వాస్పత్రిలో పారిశుద్ధ్య పనులు

చౌడేపల్లె: ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు బుధవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఆవరణలో వున్న పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలగించారు. ప్రిన్సిపాల్ జయప్రకాష్, అధ్యాపకుడు బాలాజి తదితరులు పాల్గొన్నారు.

పలమనేరులో..

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్‌డేను ఘనంగా జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ వెంకటేశులు మాట్లాడుతూ విద్యార్థులు సేవా భావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. యువత భాగస్వామ్యంతోనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు వెంకటేష్‌బాబు, రవీంద్రనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణేశ్వరిగా పార్వతీదేవి



కల్లూరు, వి.కోటలో గాయత్రీదేవిగా వాసవీ మాత



పలమనేరు : విశేషాలంకరణలో అమ్మవార్లు





పుంగనూరు, పెద్దపంజాణి : అన్నపూర్ణేశ్వరిదేవిగా పార్వతిదేవి, కాళికాదేవి, దుర్గామాత, బాలా త్రిపుర సుందరిగా మలాలమ్మ


సదుం: గాయత్రీదేవిగా రామలింగ చౌడేశ్వరీదేవి

పుంగనూరు: పట్టణంలోని భోగ నంజుండేశ్వరస్వామి ఆలయంలో పార్వతిదేవి, విరూపాక్షి మారెమ్మ బుధవారం అన్నపూర్ణేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చారు. వాసవి కన్యకా పరమేశ్వరిదేవి, చదళ్లలో చౌడేశ్వరి దేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

బాలా త్రిపుర సుందరిగా మలాలమ్మ

గంగవరం: మండలంలోని మేలుమాయి క్రాస్‌లో వున్న మలాలమ్మ (చాముండేశ్వరి దేవి) ఆలయంలో నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం అమ్మవారు బాలా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం భక్తులకు ఆలయ ధర్మకర్త చంద్రప్ప ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

గాయత్రీదేవిగా వాసవీ కన్యకా పరమేశ్వరి

పులిచెర్ల(కల్లూరు): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం కల్లూరులో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని గాయత్రీ దేవిగా అలంకరించారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సహస్ర నామార్చన చేశారు.

అన్నపూర్ణాదేవిగా కాళికాదేవి

పెద్దపంజాణి: మండలంలోని శివాడిలో వున్న కాళికాదేవి అమ్మవారు అన్నపూర్ణాదేవిగా అనుగ్రహించారు. ఉభయదారులుగా శ్రీనివాసులు, ధనుంజయాచారి, జగ్గాచారి, లోకనాథంఆచారి, రమేష్, శివాడి రజకకులస్తులు వ్యవహరించారు.

గాయత్రీ దేవిగా రామలింగ చౌడేశ్వరి

సదుం: మండలంలోని జాంద్రపేటలో వున్న రామలింగ చౌడేశ్వరి దేవి అమ్మవారు బుధవారం గాయత్రీదేవిగా భక్తులను కటాక్షించారు. సదుమమ్మను గాండ్ల సంఘం ఆధ్వర్యంలో గజ వాహనంపై ఊరేగించారు. పచ్చార్లమాకులపల్లె గంగాపురమ్మకు విశేష పూజలు చేశారు.

అన్నపూర్ణాదేవిగా దుర్గాదేవి

వి.కోట: పట్టణంలోని దుర్గానగర్‌లో వున్న దుర్గామాత బుధవారం అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం అమ్మవారికి ఊంజల్ సేవ నిర్వహించారు. అలాగే వాసవీమాత గాయత్రీ దేవిగా భక్తులను అనుగ్రహించారు.

విశేషాలంకరణలో అమ్మవార్లు

పలమనేరు: పట్టణంలోని పాతపేట గంగమ్మ సంతానతల్లిగా, కనకదుర్గ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులను అనుగ్రహించారు.